తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్ మహబూబాబాద్

సోమవారం 6 ఏప్రిల్ 2026 | పేజీలు - 8





# మద్యం మత్తు.. యువత చిత్తు



## అమ్మ కన్నీరు.. నాన్న నిస్సహాయం

- మద్యం మత్తులో మునిగిన యువత భవిష్యత్తు
- ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యం కన్నా..ఆదాయమే ముఖ్యమా?

**ఒకప్పుడు ఇంటి ముందు నవ్వులు పూయిస్తూ..తల్లిదండ్రుల ఆశల దీపంగా వెలిగిన ఆ చిన్నారులు..పెరిగి పెద్దవారైన తర్వాత చెడు వ్యసనాలకు బానిసలై..మద్యం మత్తులో తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటున్నారు. కళాశాలలో పెనవేసుకున్న స్నేహబంధాలతో పాటు పుట్టి పెరిగిన ఊరిలో చిరుప్రాయం నుండే చిగురించిన చెడు స్నేహాలతో సరదాగా మొదలైన మద్యం అలవాటు క్రమంగా బలపడి బానిసత్వంగా మారి బాటిల్ మత్తులో తమ భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకుంటున్నారు. కౌమార దశలో మొదలైన చిన్న చుక్క ఇప్పుడు కుటుంబాన్ని కుదిపేస్తున్న పెద్ద తుఫాన్ గా మారింది. కొడుకు మత్తును విడిచిపెట్టి మారుతాడని గంపెడు ఆశలు పెట్టుకున్న కన్న తల్లులు కన్నీరు మున్నీరవుతున్నారు. చెడు అలవాట్లకు బానిసలైన చెట్టంత ఎదిగిన కొడుకుని దండించలేని కన్నతండ్రులు నిస్సహాయంగా చూస్తూ..ఈ సమాజంలో మౌనంగా మగ్గిపోతున్నారు. కానీ మత్తులో మునిగిన యువతకు ఆ కన్నీళ్లు కనిపించడం లేదు. ఆ కన్నీళ్ల వెనుక దాగి ఉన్న కష్టం విలువ తెలియటం లేదు. మ ద్యం మత్తులో ప్రతిరోజు ఒక కుటుంబం చిత్తు అవుతూ చితికి పోతుంది. ప్రతిరోజు ఒక భవిష్యత్ మసకబారి చీకటిమయమవుతుంది. ఇది కేవలం ఒక ఇంటి కథ కాదు. సమాజాన్ని మొత్తం కుదిపే నిశ్శబ్ద విపత్తుపై ప్రత్యేక కథనం.**

*- మొగుళ్లపల్లి, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :*

పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా యువతలో మద్యం అలవాటు రోజురోజుకీ పెరుగుతోంది. సరదాగా మొదలైన అలవాటు ఇప్పుడు బానిసత్వంగా మారి కుటుంబాలనే కాక సమాజాన్ని కలవరపెడుతోంది. చదువు, ఉద్యోగం, లక్ష్యాలు అన్ని పక్కన పెట్టి మద్యం మత్తులో జీవితాన్ని చిత్తు చేసుకుంటున్న యువత సంఖ్య ఆందోళన కలిగిస్తుంది. కాలేజీ ప్రాంగాణాల నుంచి బెల్ట్ షాపుల వరకు యువకులు గుంపులుగా కనిపిస్తూ మద్యం సేవించడం సాధారణమైపోయింది. మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు, గొడవలు, కుటుంబ కలహాలు పెరుగుతున్నాయి. తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అవుతుంటే..ప్రభుత్వ యంత్రాంగం మాత్రం ఆదాయం పేరుతో ఖజానా నింపుకుంటూ..మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తుందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నిరుద్యోగం ఒత్తిడి, చెడు స్నేహాలు, సోషల్ మీడియా ప్రభావం వంటి కారణాలు యువతను మద్యం వైపు నెడుతున్నాయి. ఒకసారి అలవాటు పడితే దాని నుంచి బయటపడడం కష్టమవుతుంది. ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాల పెరుగుదల ఇవన్నీ మద్యం మత్తు వల్లే జరుగుతున్న దుష్పరిణామాలని పలువురు ఆరోపిస్తున్నారు. యువతే దేశ భవిష్యత్తు అంటారు. కానీ అదే యువత మద్యం మత్తులో చిత్తు అయితే సమాజం ఎలా ముందుకు సాగుతుంది? మద్యం నియంత్రణపై కఠిన చర్యలు, అవగాహన కార్యక్రమాలు, కుటుంబ స్థాయిలో పర్యవేక్షణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

### ప్రభుత్వాలకు ఆదాయమే ముఖ్యమా?

మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం రాష్ట్ర బడ్జెట్ లో కీలకంగా మారింది. కోట్ల రూపాయల ఆదాయం ఖజానాకు చేరుతుండగా, ఇదే సమయంలో యువత మద్యం మత్తులో బానిసలుగా మారుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తుంది. దీంతో ప్రజల్లో ఒక ప్రశ్న గట్టిగా వినిపిస్తోంది. ప్రభుత్వాలకు ప్రజల ఆరోగ్యం కన్నా..ఆదాయమే ముఖ్యమా? ఒకవైపు మద్యం నియంత్రణపై ప్రచారాలు, నినాదాలు..మరోవైపు మద్యం దుకాణాల విస్తరణ ఈ విరుద్ధ పరిస్థితి తల్లిదండ్రుల గుండెల్లో అనుమానాలను పెంచుతోంది."మా పిల్లలు మద్యం మత్తులో నాశనం చేసుకుంటుంటే..ప్రభుత్వాలు మాత్రం ఆదాయ గణాంకాలు చూపుతున్నాయి" అనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ప్రభుత్వాల వాదన వేరేలా ఉంటుంది. మద్యం పూర్తిగా నిషేధిస్తే అక్రమ రవాణా పెరుగుతుందని, నియంత్రిత విక్రయాల ద్వారా ఆదాయం సంపాదించి సంక్షేమ పథకాలకు వినియోగిస్తున్నామని చెబుతుంటాయి. కానీ సామాజికవేత్తలు మాత్రం మద్యం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, కుటుంబ విభేదాలు కలిపి చూస్తే ఆర్థిక లాభం కంటే నష్టం ఎక్కువేనని హెచ్చరిస్తున్నారు. ఆదాయం కోసం సమాజ భవిష్యత్తును ఫణంగా పెట్టాలా? లేక ప్రజల ఆరోగ్యం, యువత మిగతా 7లో..

# 9 అంతస్తుల రాజగోపురం... ఈశాన్యాన కోనేరు

## మూడు రెట్లు పెరగనున్న దేవాలయ విస్తీర్ణం

- రూ.225 కోట్లతో బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునఃనిర్మాణం
- శృంగేరి పీఠాధిపతుల అనుమతితో పనులు...



**బాసర, ఏప్రిల్ 05 (జనం సాక్షి) :** భారతదేశంలోని ఏకైక జ్ఞాన సరస్వతి ఆలయం అక్షరాభాస్యాలకు ఆలవాలమైన క్షేత్రం పునఃనిర్మాణంతో కొత్త శోభను సంతరించుకోబోతోంది. వేద వ్యాస మహర్షితో ప్రతిష్టతమైన ముగ్గురు అమ్మల ఆలయం ఆచారాలకు అనుగుణంగా సమున్నతమైన రాజగోపురం, కోనేరు, ఉత్తర ద్వారం అభివృద్ధి,ధ్యాన మందిరాలతో మరింతగా భక్తుల మనస్సులను ఆకట్టకోనుంది. వేల ఏళ్ల ఘన చరిత్ర గల్గిన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునః నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.225 కోట్లను కేటాయించింది. పునః నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం భూమి పూజ చేయనున్నారు.

దక్షిణ గంగగా గుర్తింపు పొందిన పవిత్ర గోదావరి నదీ తీరంలోని బాసర క్షేత్రంలో జ్ఞాన సరస్వతి దేవి కొలువై ఉన్నారు.. కురుక్షేత్ర యుద్ధానంతరం ప్రశాంతత కోసం వేద వ్యాస మహర్షి గోదావరి తీరానికి వచ్చి బాసరలో నివసించారట.. ఆ సమయంలో స్వయంగా ఆయనే గోదావరి ఇసుకతో జ్ఞాన సరస్వతితో పాటు మహా లక్ష్మి, మహా కాళి అమ్మ వార్ల మూర్తులను ప్రతిష్టించారనేది స్థల పురాణం.. అలా ముగ్గురమ్మల కొలువైన క్షేత్రంగా బాసర ప్రసిద్ధి చెందింది.

జ్ఞాన సరస్వతి కొలువైన క్షేత్రం కావడంతో ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో పిల్లలకు ఇక్కడ అక్షరాభ్యాసాలు చేయిస్తుంటారు. వసంత పంచమి, ఇతర పర్వ దినాల్లో అక్షరాభ్యాసాలకు వచ్చే పిల్లలు, తల్లిదండ్రులు, వారి బంధువులు, భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. ప్రాచీన ఆలయం కావడం. ఏటేటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగినట్లు అభివృద్ధి పనులు చేపట్టపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో బాసర ఆలయ అభివృద్ధి చేపట్టాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంకల్పించారు. సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

### శృంగేరి పీఠాధిపతుల అనుమతితో....

బాసర ఆలయ పునఃనిర్మాణ పనులకు మాస్టర్ ప్లాన్ రూపొందించే ముందు అధికారులు శృంగేరి పీఠాధిపతులతో సంప్రదించారు.గర్భాలయం, అర్ధ మండపం, రాజ గోపురం, ఇతర గోపురాలు, మాడ వీధులు, కోనేరు, ఉత్తర ద్వారాల నిర్మాణాలకు సంబంధించి పీఠాధిపతుల అనుమతులు తీసుకున్నారు. వారి సూచనలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ను రూపొందించారు.

### విశాలంగా.. సౌకర్యంగా....

భక్తుల సంఖ్య, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధ మండపాన్ని 5 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఉత్తరం వైపున 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అతంస్తుల గోపురాలు, 33 అడుగుల వెడల్పుతో నాలుగు దిక్కుల మాడ వీధులు, ఉత్తర ద్వారం నిర్మించనున్నారు. మొత్తంగా ఆలయ విస్తీర్ణాన్ని 20 వేల చదరపు అడుగుల నుంచి 62 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు.

### శిలా నిర్మాణాలు...

ఆలయంలో ప్రతి నిర్మాణాన్ని శిలలతో చేపట్టనున్నారు. 6 వేల మంది భక్తులకు అన్ని వసతులతో (ఫీడింగ్ రూమ్, ఫుడ్ స్టాల్స్, టాయిలెట్స్ తదితరాలతో) 70 వేల చదరపు అడుగులతో క్యూ కాంప్లెక్స్లు, 200 మంది ఏక కాలంలో కూర్చొని ధ్యానం చేసుకునేలా ధ్యాన మందిరం, 20 వేల చదరపు అడుగుల వైశాల్యంతో వంట శాల, మిగతా 7లో..



# సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన జగ్జీవన్ రామ్

**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్05 (జనంసాక్షి) :** సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని న్యూ కలెక్టరేట్ రోడ్డులో ఆయన విగ్రహానికి ఆదివారం మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధకుడని అన్నారు. దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడి, ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా పలు కీలక బాధ్యతలు నిర్వహించి దేశ అభివృద్ధికి విశేషంగా సేవలందించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి న్యాయవాది గాజుల రవికుమార్, కౌన్సిలర్ కత్తి నరేందర్, మాజీ ఎంపీపీ సాదా సుదర్శన్, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగన్న, లక్ష్మణ్, కోశాధికారి ముత్యం, తదితరులు పాల్గొన్నారు.

## భారత దేశానికి విశేష సేవలు అందించిన మహానేత డా.బాబు జగ్జీవన్ రామ్



**నెరడిగొండ ఏప్రిల్ 5 (జనంసాక్షి):** భారత దేశానికి విశేష సేవలు అందించిన మహానేత డా.బాబు జగ్జీవన్ రామ్ అని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగోరావు పేర్కొన్నారు. ఆదివారం రోజున బాబు జగ్జీవన్ రావు జయంతిని మండలంలోని తహాశీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ ఆర్ఐ నాగోరావు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రావు భారతదేశానికి విశేష సేవలు అందించిన మహానేత అని పేర్కొన్నారు. సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. పేదలు,దళితుల అభ్యున్నతికి ఆయన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. అలాగే ప్రతి ఒక్కరూ ఆయన ఆలోచనలు,ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో సమానత్వం నెలకొల్పడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది అధికారులు సీనియర్ అసిస్టెంట్ మిరబాయి విఆర్వోలు పాల్గొని బాబు జగ్జీవన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు



**దస్తురాబాద్, (జనంసాక్షి):** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామని తహసీల్దార్ యాదవరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. దేశ ఉప ప్రధానిగా ఆయన అందించిన సేవలు, విప్లవ కారుడిగా వేసిన అడుగులు నేటి తరానికి ఆదర్శమని ఆయన అన్నారు. నేటి యువత ఆయన నడిచిన బాటలో నడవాలని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ ఆశ సాధనకు కృషి చేయాలి

**నల్లబెల్లి, (జనంసాక్షి):** బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకై మనమందరం కృషి చేయాలని దళిత బహుజన సంఘాల నాయకులు చింతకింది కుమార స్వామి, బట్టు సాంబయ్య, పరికి కోర్నెల్, పులి రమేష్ అన్నారు. మండల కేంద్రం లోని గ్రామపంచాయతీ ఆవరణలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దళిత బహుజన రాజ్యాధికారం సాధించడమే బాబు జగ్జీవన్ రామ్ కు ఘనమైన నివాళి అని అన్నారు. దళిత సామాజిక వర్గంలో పుట్టి ఎన్నో కష్టనష్టాలను అధిగమించి బహుముఖ ప్రజ్ఞశాలిగా, స్వాతంత్ర సమరయోధుడిగా, భారతదేశ ఉప ప్రధానిగా పేరు ప్రఖ్యాతలు సాధించారాని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నత పదవుల్లో ఉన్నప్పటికీ ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి అప్రజస్వామికంగా వ్యవహరిస్తే ఇందిరాగాంధీ విధానాలను వ్యతిరేకిస్తూ బయటకు వచ్చి సాహసోపేతమైన రాజకీయ విధానాలను అవలంబించాడని అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు నేటి దళిత బహుజనులకు ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓడెల రవి, కడియాల క్రాంతి కుమార్, రవిచంద్రన్, ప్రకాష్, పవన్, కుమారస్వామి, బిక్షపతి పాల్గొన్నారు.



# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

**మహనీయుల కమిటీ నాంచారి మడూర్**



**తొర్రూరు (జనంసాక్షి):** నాంచారి మడూర్ గ్రామంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రావు గారి 118 వ జయంతి ఉత్సవాలను అంబేద్కర్ సంఘం అధ్యక్షులు సనికినేని శ్రీనివాస్ అధ్యక్షతన ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ బంగారు రమేష్ , ఉద్యోగుల సంఘం గుంటుక యాకయ్య తొర్రూర్ ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ మంద యాకమల్లు మాదిగ , సంయుక్తంగా మాట్లాడుతూ డాక్టర్ బాబు జగజీవన్ రామ్ తన సేవలు మర్చిపోలేని దేశంలో దళిత జాతిలో పుట్టి ఉప ప్రధాని వరకే దిగి దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడి. సంఘసంస్కర్త పేరు ప్రఖ్యాతలు స్వతంత్ర సమరయోధులు బ్రిటిష్ వాళ్లను తరిమికొట్టిన ఘనత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కు దక్కిందని మాట్లాడడం జరిగినది. కార్మికుల హక్కుల కోసం ఇండియా పాకిస్తాన్ మధ్యలో జరిగినటువంటి దాడిని ఢీకొని సంఘసంస్కర్త ఒక తాటికి తీసుకొచ్చినటువంటి ఘనత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు మూల ఉపాకర్ రెడ్డి, మంద నరేందర్ రెడ్డి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గుంటుక కుమార్, అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి గిద్ద గండు సైదులు, అంబేద్కర్ సంఘం అధికార ప్రతినిధి సనికినేని యాకయ్య, ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి అనపర్తి రామచంద్ర మాదిగ , వైశ్య సంఘం నాయకులు ఇమ్మడి రమేష్, ముఖ్య సలహాదారులు ఉప్పలయ్య గిద్ద పిచ్చి యాకయ్య, సనికినేని బజారు రమేష్ ,సనికినేని ఎల్లయ్య ,మంద రాములు, ఎమ్మార్పీఎస్ గిద్దె రామకృష్ణ గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.



## రంగసాయిపేట మున్నూరు కాపు సంఘం ఎన్నికలు

- **అధ్యక్షులుగా నాయిని అశోక్**
- **12వ సర్వసభ్య సమావేశం**

**వరంగల్ ఈస్ట్, (జనంసాక్షి):** వరంగల్ తూర్పు నియోజక వర్గం లోని 42వ డివిజన్ రంగసాయ పేటలో గల మున్నూరు కాపు సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానికంగా ఉన్న ఎస్ఎస్ 5 ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-2026 రెండు సంవత్సరాలకు సంబంధించిన ఆదాయ వ్యయ నివేదికలను అందించారు. ఈ సందర్భంగా సంఘం ఐక్యతకు బలోపేతానికి సభ్యులు, కార్యవర్గం ఐకమత్యంతో కృషి చేయాలని పలువురు సూచిం చారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నాయిని అశోక్,ఉపాధ్యక్షులుగా బజ్జూరి వీరేశం, ప్రధాన కార్యదర్శిగా గుర్రాల మోహన్, సహాయ కార్యదర్శి దామరకొండ నిరంజన్, కోశాధికారిగా ఇటుకాల మధుసూ దన్, సహాయ కోశాధికారిగా చాపల నాగరాజు, ఆర్గనైజర్లుగా పాల రంజిత్, కేడల చంద్రశేఖర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులుగా ఇమ్మడిశెట్టి రవీందర్, వంచనగిరి తిరుమల్, జక్కం దామోదర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నిక కాబడిన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇద్దరు మృతి



**నిర్మల్ రూరల్, (జనంసాక్షి):** నిర్మల్ పట్టణంలోని మహాలక్ష్మీ వాడాలో ఫ్రీజ్ పేలి విజయ్ అనే వ్యక్తి తోపాటు మరొక మహిళ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. శనివారం రాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఈప్రమాదం జరిగిందని కాలనీవాసులు పేర్కొన్నారు. మృతుడు విజయ్ కి భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. విజయ్ మరణంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



## బాబు జగ్జీవన్ రామ్
## ఆశించిన సమాజాన్ని నిర్మిద్దాం

**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి**

**శాయంపేట, (జనంసాక్షి):** బాబు జగ్జీవన్ రామ్ సమ సమాజ స్థాపన కోసం ఎంతో కృషి చేశారని, ఆయన ఆశించిన సమాజాన్ని అందరూ కలిసి నిర్మిద్దామని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలోనూ, స్వరాజ్యం వచ్చాక ఆధునిక భారతదేశ నిర్మాణంలోనూ స్ఫూర్తివంతమైన సేవలు అందించారని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటం ఇప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. స్వాతంత్రం అనంతరం అతి చిన్న వయసులో కేంద్ర క్యాబినెట్ లో మంత్రిగా పనిచేసే ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఓ సంఘసంస్కర్త, కేంద్రమంత్రి గా ఆయన దేశానికి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో బాసని రవి, నూర్జగాన్పల్లి సర్పంచ్ రాజీరు, మైలారం ఉపసర్పంచ్ మసికే కుమార స్వామి, మామిడి సుదర్శన్, కోల శ్రీను, కొమ్ముల విష్ణు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్
## జయంతి వేడుకలు



**భీమదేవరపల్లి (జనంసాక్షి):** మండలంలోని హుస్నాబాద్ రోడ్ క్రాస్ వద్ద డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ చైర్మన్ పచునూరి కరుణాకర్ మాట్లాడుతూ,ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల అభివృద్ధికి బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. రిజర్వేషన్ వ్యవస్థ ద్వారా ఇప్పటికీ అనేక వర్గాలు ప్రయోజనం పొందుతున్నాయని తెలిపారు. రాజకీయాల్లో ఆయన గొప్ప మేధావిగా, శక్తివంతమైన నాయకుడిగా ఎదిగి, దేశానికి తొలి దళిత ఉప ప్రధానమంత్రిగా సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డేగల సారయ్య, రేణిగుంట్ల బిక్షపతి, పాల్గొన్నారు.

# డీసీసీ కార్యాలయంలో ఘనంగా బాబు జగ్జీవన్ రాం జయంతి వేడుకలు



**జనగామ ప్రతినిధి, (జనంసాక్షి):** జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో మహానేత, స్వాతంత్ర్య సమరయోధుడు మరియు మాజీ ఉప ప్రధాని బాబు జగజీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్ గారు హాజరై, బాబు జగ్జీవన్ రాం గారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రాం దేశ స్వాతంత్ర్యానికి చేసిన సేవలు మరియు దళితుల సాధికారత కోసం చేసిన పోరాటం అపారమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ సమాజంలో సమానత్వం, న్యాయం సాధించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన ఆయన, దేశ నిర్మాణంలో కూడా అసాధారణ సేవలు అందించారు. ముఖ్యంగా బలహీన వర్గాల అభివృద్ధి, దళితుల సాధికారత మరియు సామాజిక సమానత్వం కోసం ఆయన జీవితాంతం పోరాడారు. కార్మిక శాఖ, రక్షణ శాఖ వంటి కీలక మంత్రిత్వ శాఖలను సమర్థవంతంగా నిర్వహించి, దేశ అభివృద్ధికి దిశానిర్దేశం చేశారు. 1971 యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా ఆయన చూపిన నాయకత్వం చరిత్రలో ప్రత్యేకంగా నిలిచింది. సమానత్వం న్యాయం అనే విలువలను తన జీవిత ధ్యేయంగా మార్చుకున్న బాబు జగ్జీవన్ రాం గారు, ప్రతి పౌరుడికి గౌరవంగా జీవించే హక్కు ఉండాలని బలంగా విశ్వసించారన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, బచన్నపేట మండల అధ్యక్షులు నూకల బాల్ రెడ్డి, నర్మెట్ట మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

# ముల్కనూరులో బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు



**భీమదేవరపల్లి (జనంసాక్షి):** మండలంలోని ముల్కనూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం మహనీయుల ఉత్సాహ కమిటీ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కమిటీ చైర్మన్ కొలుగూరి రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు,నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కమిటీ చైర్మన్ కొలుగూరి రాజు మాట్లాడుతూ,బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు సమాజానికి మార్గదర్శకాలని పేర్కొన్నారు.దళితుల అభ్యున్నతి సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.అణగారిన వర్గాల ఎదుగుదలకు ఆయన చూపిన మార్గాన్ని కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి మహనీయుల జయంతులను కేవలం కార్యక్రమాలకే పరిమితం కాకుండా వారి ఆశయాలను ఆచరణలో పెట్టే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువత బాబూజీ జీవితం నుండి స్ఫూర్తి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోజ్జపురి అశోక్ ముఖర్జీ,మాదుగుల కొమురయ్య,మంగ రామచంద్ర్, మాదుగుల ప్రేమ్ రాజ్, మాదుగుల అశోక్, తూముల సదానందం, అంబాల చక్రపాణి, మాట్ల వెంకటస్వామి, రేణికుంట్ల బిక్షపతి, బొల్లంపల్లి కాంతారావు, మాదుగుల గోపి,గజ్జల సురేష్,బొలెరో పిల్లి ప్రకాష్,గొర్రె సదానందం మాదుగుల బాబు, మాదుగుల ఈశ్వరయ్య స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న పుల్సం సురేష్



**గంగారం ఏప్రిల్ 5 (జనంసాక్షి):** మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు,ములుగు నియోజకవర్గం డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్, రాష్ట్ర యువజన కార్యదర్శి కుంజా సూర్య, గంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు సూచనలమేరకు దశదిన కర్మ కార్యక్రమానికి మృతుడి కుటుంబ సభ్యులను ఆర్థిక సహాయం చేసిన శ్రీశ్రీ గుంజేడు ముసలమ్మ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పుల్సం సురేష్ 25 కేజీల బియ్యం ఆర్థిక సాయం చేశాడు గంగారం మండలం కోడిశాల మిట్ట గ్రామానికి చెందిన చింత వెంకటయ్య గారు ఇటీవల మృతి చెందగా,ఈ రోజున మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి 25కేజీల రైస్ ఆర్థిక సహాయం చేసినాడు ఈ కార్యక్రమంలో చింత రఘు, చింత నాగయ్య,మరియు వార్డు మెంబెర్. గుంట అరుణ, సూర్యం తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఈస్టర్ పండుగ వేడుకలు

### కోనాపురంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం

**చెన్నారావుపేట, (జనంసాక్షి):** ఈస్టర్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని కోనాపురం గ్రామంలో ఈస్టర్ వేడుకలను పురస్కరించుకొని ఏసుక్రీస్తు తిరిగి లేచిన రోజుగా ఆదివారం జెడిఈఎం బాప్టిస్ట్ చర్చి పాస్టర్ ఏబి నేజర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్టియన్ భక్తులకు శాంతి సందేశాన్ని అందించారు. అనంతరం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కొమ్మాలు, స్వామి, అశోక్, నగేష్, రాజు, భాస్కర్, అనిల్, రాజన్, మహేందర్, రాజేష్, మాణిక్యం, మల్లేశం, రవి, ప్రవీణ్, కార్తీక్, అఖిల్, ప్రశాంత్, ప్రభాస్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సులు..

## భక్తాంజనేయ స్వామి అభయం ప్రజలందరిపై ఉండాలి

### మెట్ పల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ పెండెం రాజేందర్



**మొగుళ్ళ పల్లి (జనంసాక్షి):** శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సులు.. భక్తాంజనేయ స్వామి అభయం ప్రజలందరిపై ఉండాలని మెట్టుపల్లి గ్రామ శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ పెండెం రాజేందర్ తన ఆరాధ్య దైవాలను వేడుకున్నట్లు తెలిపారు. ఆదివారం ఆయన మెట్టుపల్లి భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. భక్తాంజనేయ స్వామి 15వ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ సహిత శ్రీకృష్ణ పరమాత్మ ఉత్సవా కళ్యాణ విగ్రహాలకు చర ప్రతిష్ట అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి కళ్యా ణం జరిపించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సులు ప్రజలకు మెండుగా ఉండాలని..ఆ భక్తాంజనేయ స్వామి అభయంతో ప్రజలు సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, పిల్లాపాపలతో, పాడి పంటలతో, కుటు ంబ సభ్యులతో ఎలాంటి కలహాలు లేకుండా కలిసిమెలిసి హాయిగా నిండు నూరేళ్లు బతకాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పం చ్ మంద సుధాకర్, దేవాలయ కమిటీ గౌరవ సభ్యులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, యార సమ్మయ్య, వార్డు సభ్యులు దర్శనాల రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

## సామజిక న్యాయ పోరాట యోధుడు జగ్జీవన్ రామ్

### మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్.



**బెల్లంపల్లి, ఏప్రిల్ 5, (జనంసాక్షి):** సామజిక న్యాయ పోరాట యోధుడు బాబు జగ్జీవన్ రామ్ అని మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ అన్నారు. ఆదివారం ఆమె బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా జగ్జీవన్ రామ్ విగ్రహాని పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర సమర యోధుడు, సామజిక న్యాయ పోరాట యోధుడు, అణగారిన వర్గాల ఆశాదీపం అని అన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు మరువలేమని, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన జీవితాంతం సాగించిన పోరాటం మనందరికి స్ఫూర్తిదాయకం అన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సి, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్, మున్సిపల్ కౌన్సిలర్లు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అమ్మఒడి ఆధ్వర్యంలో అన్నదానం



**బెల్లంపల్లి, (జనంసాక్షి):** బెల్లంపల్లి పట్టణం కాంటా చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద ఆదివారం అమ్మఒడి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మఒడి ప్రాజెక్టు మేనేజర్ హనుమండ్ల మధుకర్ మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో ప్రతి ఆదివారం నిర్విరామంగా కొనసాగించాలనే సదుద్దేశంతో 05/04/2020 రోజున ప్రారంభించామని అన్నారు. కొనసా గింపుగా నేడు బెల్లంపల్లి పట్టణంలో అన్నమో రామచంద్ర అని అలమటించే ఎందరో, ఆకలి తీరుస్తున్నామన్నారు. 377వ సారి అన్నదానం నిర్వహిం చామన్నారు. నేటి కార్యక్రమం పేరు తెలపడానికి ఇష్టపడని గుప్త దాత సహకా రంతో అన్నదాన కార్యక్రమం చేపట్టామన్నారు. యాచకులకు, నిరుపేదలకు, దినసరి అడ్డ కూలీలకు, బాటసారులకు సుమారు 200 మందికి అన్నదానం చేసినట్లు వివరించారు. ఆకలితో ఉన్నవారికి ఆకలి తీర్చడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, గన్నెవరం తిరుమల చారి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## జనగాంలో తెలంగాణ రన్నర్స్ ప్రోమో రన్ విజయవంతం




**జనగామ ప్రతినిధి, ఏప్రిల్ 5(జనంసాక్షి):** తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో జనగాం పట్టణం లోని బతుకమ్మ కుంట నుండి షామీర్‌పేట్ వరకు 2ఖ, 5ఖ, 10ఖ ప్రోమో రన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో దాదాపు 400 మందికి పైగా రన్నర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా: డీసీపీ సీతారాం నాయక్ గారుజనగామ మున్సిపల్ చైర్మన్ బాలమణి శ్రీనివాస్ గారుపట్టణ సీఐ సత్యనారాయణ రెడ్డి హాజరయ్యారు.వారు మాట్లాడుతూ యువత సమాజంలో మద్యం, మారకద్రవ్యాలు (గంజాయి) వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన: పాఠశాల యజమాన్యం తాజ్ హోటల్ యజమాన్యం కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు: వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థలుఅవంతిక కన్స్ట్రక్షన్స్ శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రన్నర్స్ సభ్యులు హరీష్ రెడ్డి గారు, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్,స్కూల్ కరస్పాండెంట్ కీర్తి వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేటలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు



**వర్ధన్నపేట, ఏప్రిల్ 05:(జనం సాక్షి ).** భారత మాజీ ఉప ప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి 119వ జయంతి వేడుకలు వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. వర్ధన్నపేట మహనీయుల మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మాస్ (మీూరూ) అధ్యక్షులు జన్ను రాములు మాదిగ మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు."ప్రతి గ్రామంలో, మండలంలో, జిల్లా కేంద్రాల్లో బాబు జగ్జీవన్ రామ్ గారి జయంతి ఉత్సవాలనుఒక పండుగలా నిర్వహించి, ఆయన పోరాట పటిమను భావి తరాలకు తెలియజేయాలి."ఈ వేడుకలో వర్ధన్నపేట మండలం మహనీయుల కమిటీ చైర్మన్ మారపల్లి ఎల్లయ్య మాదిగ, వైస్ చైర్మన్ కంజర్ల మహేష్ మాదిగ నేతృత్వం వహించారు. వీరితో పాటు కింది నాయకులు పాల్గొన్నారు:మరుపట్ల అంజయ్య మాదిగ, ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ (ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు)ముత్యాల మల్లేశం మాదిగ (వర్ధన్నపేట మండల మీూ అధ్యక్షులు)చాడ కరుణాకర్ మాదిగ (ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు)బిర్రు బిక్షపతి మాదిగ (మీూ మండల అధికార ప్రతినిధి) ముత్యాల సులేందర్ మాదిగ (కట్ర్యాల గ్రామ శాఖ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు)ఈ కార్యక్రమంలో ముత్యాల సంజీవ మాదిగ, ఎర్ర ప్రేమ్ మాదిగ రాజ్, కొండేటి సంపత్ మాదిగ, రాజు మాదిగ, తుళ్ల రమేష్ మాదిగ, కొండేటి సురేష్ మాదిగ తదితరులు పాల్గొని జగ్జీవన్ రామ్ గారికి ఘన నివాళులు అర్పించారు.

## న్యూస్ పేపర్ ఏజెంట్స్ పరపతి పరస్పర సహాయక సహకార సంఘం నూతన కమిటీ ఎన్నిక



**నల్లబెల్లి, ఏప్రిల్ 05 (జనంసాక్షి):** న్యూస్ పేపర్ ఏజెంట్స్ పరపతి పరస్పర సహాయక సహకార సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బోడ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కెవి సునీల్ చౌదరి, ఉపాధ్యక్షుడిగా ఉప్పుల సతీష్, కోశాధికారిగా వెన్న రవి, కార్యవర్గ సభ్యులుగా గూడూరి వేణు ప్రసాద్, వరికేల హరికృష్ణ, దురిశెట్టి రమేష్, చిర్ర రాజు గౌడ్, కొనకంటి సతీష్, మాచెర్ల ఈశ్వర్ గౌడ్, శ్రీరామోజు ప్రవీణ్, కురిమిల్ల రామ్మోహన్, చాడ రాము, నానవేని రాజు, తేజవత్తు మురళి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్లో 16వ వార్షిక సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు బోడిగే శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. సంఘం లావాదీవీలు చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఉప్పు రాజేందర్, బాసాని శ్రీధర్, దేవేందర్, వెంకట్ రెడ్డి, చిర్ర రమేష్ గౌడ్, కుడికాల ప్రసాద్, అక్తర్ హుస్సేన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్. జగ్జీవన్ రావు విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఆధ్వర్యంలో బిజెఆర్ జయంతి వేడుకలు



**బచ్చన్నపేట ఏప్రిల్ 5 ( జనం సాక్షి):**బచ్చన్నపేట మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి ఉత్సవాలు అంబేద్కర్ జగ్జి వన్ రావ్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు కంత్రి సత్తయ్య అధ్యక్షతన వహిం చగా. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ అల్వాల నర్సింగరావు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ యొక్క సేవలను బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేసిన సంఘసంస్కర్త మరియు అస్పృశ్యత అంటరానితనం నిర్మూలన కోసం . బడుగు బలహీన వర్గాల ఓటు హక్కు కోసం పోరాటం చేసిన స్వాతంత్ర సమరయోధులు భారతదేశ మొట్టమొదటి ఉప ప్రధాని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషి మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమలో ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు మల్యాల బాల్ నరసయ్య, తమ్మడి మహేందర్. పైసా రాజశేఖర్. అల్వాల రాజు, మల్యాల అఖిల్ , కూరాకుల హరి.కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మాజీ సర్పంచ్ నల్లగొని బాలకిషన్ గౌడ్, తేలు కంటి శ్రీనివాస్. టిడిపి రాష్ట్ర నాయకులు అల్లాదుర్గం వెంకటేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్వాల రమేష్, పెరిమల్ల యాదగిరి, అలవాల స్వామి, గంధ మల్ల మల్లేష్,చింతల వెంకటయ్య, సుధాకర్ రెడ్డి, రాగిరి సత్తయ్య, ఈదులకంటి వెంకట్ రెడ్డి, బందారం లక్ష్మయ్య,మార్క బిక్షపతి, ఎండి అజీమ్, ఎండి ఇసుఫ్, బావుండ్లపల్లి అంజయ్య, గుడ్ల మనోహర్, అల్వాల అనిల్ కుమార్, కక్కర్ల గణేష్, శ్రీనివాస్, కనకం విజయ్, మల్లేశం పంబాల మల్లేశం, బొట్టు గణేష్, సందెల నాగేష్, అందే శ్రీనివాస్, బొమ్మల నాగేశ్వరరావు, పురాణం శ్రీనివాస్, శివరాత్రి రాజు, అనిల్, తదితరులు పాల్గొన్నారు

## బర్ల దేవదాస్ జ్ఞాపకార్థం మండల స్థాయి టి టెన్ క్రికెట్ క్రీడా పోటీలు

**చెన్నారావుపేట ఫ్రెండ్స్ యువజన సంఘం**



**చెన్నారావుపేట, ఏప్రిల్ 5( జనం సాక్షి):** చెన్నారావుపేట మండల స్థాయి టి 10 క్రికెట్ టోర్నమెంట్ ను చెన్నారావుపేట కాలనికి చెందిన గ్రామ పెద్ద కీర్తిశేషులు బర్ల దేవదాసు జ్ఞాపకార్థకంగా ఆయన కుమారుడు గ్రామ పెద్ద బర్ల శ్రీకాంత్ ఆర్థిక సౌజన్యంతో ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఫ్రెండ్స్ యువజన సంఘం బాధ్యులు ఆదివారం తెలిపారు.ఈ క్రీడలను ఈనెల 10వ తేదీన శుక్రవారం నిర్వహించడం జరుగుతుందన్నారు.క్రీడల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.10 వేల 16, ద్వితీయ బహుమతిగా రూ.5 వేల 16 లు అందించడం జరుగుతుందని ఫ్రెండ్స్ యువజన సంఘం అధ్యక్షులు సింగిరెడ్డి అనిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు సాధు నర్సింగరావు, మాజీ అధ్యక్షులు జంగిలి కిరణ్, మాదాసి ప్రవీణ్, ఉపాధ్యక్షులు జంగిలి రాజేష్, బర్ల కార్తీక్, సతీష్, ఈశ్వర్, ప్రవీణ్, సాత్విక్, బింటు, బబ్లూ, తదితరులు పాల్గొన్నారు.కావున ఆసక్తి గల క్రీడాకారులు, క్రీడాభిమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడల్లో పాల్గొనాలనుకునేవారు సింగిరెడ్డి అనిల్ 8186065663, బర్ల కార్తీక్ 6281678563, సాధు సాత్విక్ 9392113946,నర్మెట ఈశ్వర్ 9866114226 ల నెంబర్లకు ఫోన్ చేసి తమ టీం పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.

## కాంగ్రెస్ వ్యాఖ్యలపై బీజేపీ నేత రావుల రాంనాథ్ ఫైర్



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్05(,జనంసాక్షి)** నిర్మల్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. శనివారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిర్మల్లో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, చరిత్ర తెలియకపోయినా రాజకీయ ప్రయోజనాల కోసం మాట్లాడుతున్నారని అన్నారు.రాముడి గురించి, స్వాతంత్ర పోరాటం గురించి కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు అనవసరమని, ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ బలిరామ్ హెడ్గేవర్ వంటి నాయకులు కూడా స్వాతంత్ర సమరంలో భాగమయ్యారని గుర్తు చేశారు. అలాగే జనసంఘ్ నాయకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ జమ్మూ కాశ్మీర్ కోసం ప్రాణత్యాగం చేశారని తెలిపారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ బలంగా ఉందని, భవిష్యత్ ఎన్నికల్లోనూ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు.ఈ సమావేశంలో కౌన్సిలర్ జింక సూరి, మాజీ కౌన్సిలర్లు పొడెల్లి గణేష్, నాయకులు పూదరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## బచ్చన్నపేట మండల కేంద్రంలో ఘనంగా ఈస్టర్ వేడుకలు:అల్వాల రమేష్



బచ్చన్నపేట ఏప్రిల్ 4 ( జనం సాక్షి): బచ్చునపేట మండల కేంద్రంలో ఆదివారం నాడు క్రీస్తు ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు క్రీస్తు అభిమాని అల్వాల రమేష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మరణం తర్వాత మూడవరోజు తిరిగి లేచిన పునర్థానము సందర్భముగా క్రైస్తవులు జరుపుకునే ప్రతి ముఖ్యమైన, ఆనందకరమైన పండుగ ఈస్టర్ అని ఇది వసంత కాలంలో సాధారణంగా మార్చి లేదా ఏప్రిల్ నెలలో గుడ్ ఫ్రైడే తర్వాత ఆదివారం నాడు వస్తుందన్నారు. ఇది కొత్త జీవితానికి పాపము విజయం పై ఆనందపడతారు, ప్రత్యేకంగా ప్రార్ధనలు క్రైస్తవులు చర్చికి వెళ్లి ఉదయకాల ఆరాధనలు సన్ రైస్ సర్వీస్ ప్రత్యేకంగా ప్రార్ధనలో పాల్గొంటారు. కొత్త జీవితానికి పునర్జీవనానికి చిన్హాలుగా గుడ్లను రంగులతో అలంకరించి పంచుకుంటారు.ఈ సమయంలో పిల్లల కోసం ఈస్టర్ బన్నీ ఆకారంలో చాక్లెట్లు బహుమతులు ఇస్తారు, కుటుంబ సభ్యులు స్నేహితులు కలసి ప్రత్యేకంగా వంటకాలతో విందు చేసుకుంటారు.ఈస్టర్కు ముందు 40 రోజులు పాటు ఉపవాసం ప్రార్ధనలతో కూడిన పశ్చాత్తాప సమయాన్ని పాటిస్తారు. ఈస్టర్ ముందు వారం ఏసు ప్రవేశం పలం సండే చివరి భోజనం హోలీ థాట్స్ డే సిలువ వేయడం గుడ్ ఫ్రైడే జ్ఞాపకం చేసుకుంటారు. ఈ పండుగ ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా భారతదేశంలో ఎక్కువ ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. క్రిస్టియన్ ఫ్యామిలీకి ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు



## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

**అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో**

**మంగపేట ఏప్రిల్ 05 (జనంసాక్షి):** భారతదేశ మాజీ ఉప ప్రధాని ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద అంబేద్కర్ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏంపెల్లి వీరస్వామి, బోడ రామచంద్రం అధ్యక్షతన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంబేద్కర్ సంఘం నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, బండ జగన్మోహన్ రెడ్డి, అయ్యోరి యానయ్య లు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దళిత జాతిలో పుట్టి కార్మిక చట్టాల రూపకర్తగా వివిధ శాఖలో మంత్రిగా భారత దేశ ఉప ప్రధానిగా ఎన్నో కీలక పదవులు పొందారు. నేటి యువత కూడా ఆయన సేవలను స్మరించుకోవాలని ఆయన ఆశయ సిద్ధాంతాలను కొనసాగించాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు ఎడ్ల నరేష్, దాసరి ఎల్లయ్య, రవి, గాజర్ల రాజు, బూర్గుల సతీష్, దాసరి బుజ్జి, కాటబోయిన నర్సింగారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రావు జయంతి



**స్టేషన్ ఘన్పూర్, ఏప్రిల్ 04, (జనంసాక్షి) :** మండలం లోని పామునూరు గ్రామంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రావు 119వ జయంతి రాష్ట్ర దళిత నాయకుడు ముఖ్య అతిథిగా కలకోల యాదగిరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినా రు. ఈ సందర్భంగా సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి తన జీవితాన్ని అంకితం చేసి న ప్రముఖ రాజకీయ నాయకుడు సంఘసంస్కర్త స్వతంత్ర సమరయోధుడు మరియు మాజీ భారతదేశ ఉప ప్రధానిగా చేసినారు బాబు జగ్జీవన్ గారని అన్నారు.తన చిన్న వయసులోనే దేశ పార్లమెంటు లో మంత్రిగా దాదాపు అన్ని శాఖలను నిర్వర్తించినారు 50 సంవత్సరాల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడిగా ఎదిగి దేశానికి ఎంతగానో సేవలు చేసి సిఎస్సి బిసి మైనార్టీల కొరకు రాజ్యాధికారం కొరకు కృషి చేసినారు బహుజను లు పాలకులుగా ఎదగాల ని రాజ్యాంగంలో పొందుపరిచిన ఫలాలను బహుజనులకు అందే విధంగా కృషి చేసినారని పామునూరు గ్రామంలో జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలకోల యాదగిరి రాష్ట్ర దళిత నాయకుడు, సర్పంచ్ సంపత్ రెడ్డి తాళ్లపల్లి శివ గౌడ్ బిజెపి యుగంధర్ రెడ్డి రాష్ట్ర నాయకులు మరియు పాలాటి వెంకన్న దళిత కళా మండలి జిల్లా అధ్యక్షులు వాడు మెంబర్ కల కోల దాస్ పాలాటి ఎల్లయ్య పాలాటి భాస్కర్ కల కోల సుమన్ కల కోలా వెంకటేష్ కల కో ల శ్రీనివాస్ కల కో ల సుధాకర్ కల కోలయాక స్వామి బా ల్లె పూలమ్మ బలే కొమురెల్లి బల్లె వెంకటయ్య జోగు నరసయ్య పాలాటి సుధాకర్ మొదలగు వారు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రేఖా నాయక్ పరామర్శ



**ఖానాపూర్ ఏప్రిల్ 05 (జనంసాక్షి):** గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురైన సిపిఐ (ఎం ఎల్) మాస్ లైన్ (ప్రజా పంత) ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్యను మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖ నాయక్ పరామర్శించారు. ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి కలిసి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. నందిరామయ్య త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

## ఎస్పీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఆదివారం డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు, సంఘసంస్కర్త, సామాజిక చైతన్యానికి ప్రతీక, భారత మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో సమానత్వం, న్యాయం స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, ఆర్ఐ రత్నం, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**నస్పూర్ (జనంసాక్షి):** నస్పూర్ మండల బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బన్న ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన గొప్ప సేవలను కొనియాడారు.సామాజిక న్యాయం కోసం,దళితుల అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు.ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మండలం బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేరుగు పవన్ కుమార్,కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్,టిబిజికెఎస్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్,మాజీ కౌన్సిలర్ వంగ తిరుపతి, నాయకులు ఆకునూరి సంపత్,రుకుం తిరుమల్, జాడి భానుచందర్,యూత్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రావు సేవలు ఆదర్శనీయం

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె హరిత.**



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** కొమరం భీమ్ జిల్లా ఆసిఫాబాద్ కలెక్టర్ కార్యాలయంలో భారత మాజీ ఉపప్రధాని,బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హరిత,ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ రక్షణ మంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలు గుర్తు చేస్తూ,అణగారిన వర్గాల గొంతుకగా నిలిచిన బాబుజీ ఆశయ సాధనలో మనమంతా భాగస్వామ్యులం అవుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్ , మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి. అహ్మద్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

## ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**పరకాల, ఏప్రిల్ 5 (జనంసాక్షి):** స్వతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతిని పురస్కరించుకొని పరకాల పట్టణ కేంద్రంలోని బస్టాండ్ కుడలి లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టన వ్యవస్థాపక అధ్యక్షులు బొచ్చు అనంతరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పరకాల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఏకు దివ్య విద్యాసాగర్ పాల్గొని జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబూజీగా ప్రసిద్ధి చెందిన జగ్జీవన్ రామ్ జాతీయ నాయకుడు, స్వాతంత్ర్యసమరయోధుడు,సామాజిక న్యాయ పోరాట యోధుడు,అణగారిన వర్గాల పోరాట యోధుడనీ కొనియాడారు.ఈ కార్యక్రమంలో పరకాల మండలం ఎస్సీ విభాగం అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి,కౌన్సిలర్స్ బొచ్చు మాధవిలత జాన్సన్, బొచ్చు సుభద్ర సాల్మన్, పాలకుర్తి శ్రీనివాస్, బొచ్చు శ్యామల బాబురావు, సుధమల్ల రమేష్, పరకాల పట్టణ కాంగ్రెస్ నాయకులు బొచ్చు మోహన్ ,బొచ్చు జెమిని, దుప్పటి సదయ్య, ఆయిలిపెల్లి స్వామి, బండి రాజు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భారత మాజీ ఉపప్రధాని దళిత వర్గాల ఆశాజ్యోతి, సమతవాది స్వర్గీయ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి మున్సిపాలిటీలోని ఎస్సీ, ఎస్టీ సింగరేణి అసోసియేషన్ ఆఫీస్ ఆవరణలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.వి రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భూపాలపల్లి అధ్యక్షులు గడిపె చక్రపాణి, 26వ వార్డు కౌన్సిలర్ ఓరగంటి రాధ ఐలయ్యలు పాల్గొని పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చంటి, చంద్రగిరి, శంకర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా దుర్గామాత పండుగ

**- మాజీ సర్పంచు గిద్దెల రమేష్ ఏర్పాటు చేసిన సాముహిక విందు భోజనం**

**బచ్చన్నపేట, (జనంసాక్షి):** బచ్చన్నపేట మండలంలోని పడమటికేశ్వపూర్ గ్రామంలో ఆదివారం నాడు దుర్గామాత పండుగ గ్రామస్థులందరూ కలిసి అత్యంత వైభవంగా జరుపుకున్నారు.దుర్గామాత పండుగ అనంతరం పడమటికేశ్వపూర్ మాజీ సర్పంచు గిద్దెల రమేష్. దుర్గమ్మ గుడి ఆలయ నిర్వహకురాలు గిద్దెల పుష్ప ఏర్పాటు చేసిన సాముహిక విందుకు మండలంలోని బంధుమిత్రులు హజరైయ్యారు. ఈ సందర్భంగా గిద్దల రమేష్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు పిల్లాపాపలు పాడి పంటలు పండి సుఖ సంతోషాలతో ఆ తల్లి దీవించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు గిద్దెల రాజు. బురుగు మంజుల.మల్యాల అఖిల్ మాల తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టు శ్యాంను పరామర్శించిన టీఎస్ జేయు నేతలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సీనియర్ జర్నలిస్టు సామంతుల శ్యాం ను ఆదివారం తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్ జేయు) జిల్లా నాయకులు పరామర్శించారు. సామంతుల శ్యాం గత కొద్ది రోజుల క్రితం అపెండెక్స్ నొప్పితో బాధపడుతూ సర్జరీ చేసుకుని ఇంటివద్ద చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న టీఎస్ జేయు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తడుక సుధాకర్ గౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎడ్ల సంతోష్, దొమ్మాటి రవీందర్ లు వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శ్యాం తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయు జిల్లా నేతలు గట్టు రవీందర్, మారెపెల్లి చంద్రమౌళి, బొల్లెపెల్లి జగన్, కడపాక రవితో పాటు జర్నలిస్టులు శేఖర్ నాని, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**నిర్మల్ బ్యూరో, (జనంసాక్షి):** కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం స్వతంత్ర సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముందుగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ భారత స్వాతంత్ర ఉద్యమంలో విశేష సేవలు అందించారని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం ఉప ప్రధానిగా దేశ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దళిత వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, డిఈఓ భోజన్న, పరిశ్రమల జిల్లా మేనేజర్ నరసింహ రెడ్డి, యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు, పలువురు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 10 లీటర్ల గుడుంబా స్వాధీనం

### 110 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

### ఒకరి పై కేసు నమోదు

**చెన్నారావుపేట, ఏప్రిల్ 5 (జనంసాక్షి ):** 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని 110 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు చెన్నారావుపేట ఎస్ఐ రాజేష్ రెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన చెరుకుపల్లి కోమల గుడుంబా తయారు చేసి అమ్మకాలు చేపట్టుచున్నదనే నమ్మదగిన సమాచారం మేరకు గుడుంబా స్థావరంపై దాడి నిర్వహించినట్లు తెలిపారు. 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని 110 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే గుడుంబా తయారు చేసి అమ్మకాలు చేపడుతున్న చెరుకుపల్లి కోమలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

### కాటారం డివిజన్‌లో సీనియర్

## సిటిజన్స్ డేకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

### ఎం.రఘు శంకర్ రెడ్డి



**కాటారం ఏప్రిల్ 4 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో పెన్షనర్స్ మరియు సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాటారం డివిజన్ కేంద్రంలో సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర సీనియర్ సిటిజన్ నాయకులు, డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు విద్యా పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శి ఎం. రఘు శంకర్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలో కాటారం రెవెన్యూ డివిజన్ స్థాయి పెన్షనర్స్ మరియు సీనియర్ సిటిజన్స్ సమావేశం సీనియర్ సిటిజన్ జనగామ కరుణాకర్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పలిమెల, మహాదేవపూర్, కాటారం, మహాముత్తారం, మలహర్రావు మండలాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎం. రఘు శంకర్ రెడ్డి మాట్లాడుతూ కాటారం డివిజన్ పరిధిలో సుమారు 450 మంది పెన్షనర్స్ మరియు వేలాదిగా సీనియర్ సిటిజన్స్ ఉన్నారని తెలిపారు. వారి శారీరక, మానసిక ఉల్లాసం కోసం, జీవన నాణ్యత మెరుగుపర్చేందుకు సీనియర్ సిటిజన్స్ రిక్రియేషన్ మరియు డే కేర్ సెంటర్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర సీనియర్ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకొని డే కేర్ సెంటర్ మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో అంకమ్మ, అంకన్న, శంకరయ్య, వెంకటి, ఎం. రవి శంకర్ రెడ్డి, ఎం. రఘు శంకర్ రెడ్డి, జె. కరుణాకర్ రావు, మధుసూదన్ రావు, దామోదర్ రెడ్డి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. తిరుపతి పాల్గొన్నారు.

## మారాపాక నాగరాజు ఆధ్వర్యంలో

### బాబు జగజీవన్ వేడుకలు

**స్టేషన్ ఘన్పూర్, (జనంసాక్షి) :** మండలంలోని తాటికొండ గ్రామంలో బాబు జగ జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబు జగజీవన్ రామ్ కమిటీ అధ్యక్షులు మారాపాక నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విగ్రహ వ్యవస్థాపకులు, మాజీ జడ్పీటీసీ జెడ్ పి స్టాండిం గ్ కమిటీ చైర్మన్ మారాపాక రవి, గ్రామ సర్పంచ్ శ్రీమతి మరపాక సుజన శ్రీనివాస్ హాజరై జగజీవ న్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం బర్త్‌డే కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి ఆర్ అంబేద్కర్ రాజ్యాం గంలో దళితులకు రిజర్వేషన్ కల్పించడమే కాకుండా తరతరాలుగా వారి హక్కులను రక్షించే విధంగా నిబంధనలు ఏర్పాటు చేశారని కొనియా డారు. సామాజిక సమానత్వం కోసం బాబు జగజీ వన్ రామ్ చేసిన కృషి దేశానికి ఆదర్శమని తెలి పారు. ఈ సమావేశానికి గ్రామ ఉప సర్పంచ్ ఎడమ కట్టమల్లు, వార్డు సభ్యులు మరపాక ఏలీయా, నలిమేల కోమల, మాజీ ఉప సర్పంచ్ మారాపాక రాములు, విగ్రహ కమిటీ ప్రధాన కార్యదర్శి మారాపాక రాంచందర్, ఎంఆర్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మారాపాక సంపత్, బిఆర్ ఎస్ పార్టీ నాయకులు మారాపాక మనోహర్, సిపిఎం నాయకులు మారాపాక మధు బాబు, కుల పెద్దలు, యువ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



### ముత్తారం వైఈఎం

## చర్చిలో భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



**భీమదేవరపల్లి (జనంసాక్షి):** మండలంలోని ముత్తారం గ్రామంలోని వైఈఎం చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాస్టర్లు ఎజ్రా, మసిలామణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ,యేసు క్రీస్తు మన పాపాల కొరకు శిలువపై మరణించి, మూడవ రోజు పునరుత్థానం చెందిన దినాన్ని ఈస్టర్‌గా జరుపుకుంటామని తెలిపారు.ప్రేమ,శాంతి, సహనం వంటి విలువలను జీవితంలో ఆచరించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.ఈస్టర్ పండుగ కొత్త ఆశలు, నూతన ప్రారంభానికి సంకేతమని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రదర్ వినయ్ ఆత్మీయ సందేశాన్ని అందించారు. తోమా మొదట యేసు పునరుత్థానాన్ని నమ్మకపోయినా, అనంతరం యేసు ప్రత్యక్షమై తన గాయాలను చూపిన తర్వాత గట్టి విశ్వాసిగా మారిన విషయాన్ని వివరించారు. సందేహాలు వచ్చినప్పుడు దేవుని దగ్గరకు వెళ్లి నిజాన్ని తెలుసుకుని విశ్వాసంలో ముందుకు సాగాలని సూచించారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు పాల్గొని ప్రార్థనలు చేసి తమ భక్తి భావాన్ని వ్యక్తం చేశారు.

## జూనియర్ సివిల్ జడ్జిగా సుకన్యకు సన్మానం



**రామకృష్ణాపూర్, (జనంసాక్షి):** జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన కలువల సుకన్యకు రాంనగర్ 13వ వార్డు ప్రతినిధులు ఘన సన్మానం నిర్వహించారు. ఆదివారం ఆమె నివాసంలో జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్ జక్కినబోయిన మంజుల కుమార్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, స్థానిక నాయకులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబానికి చెందిన సుకన్య పట్టుదలతో సాధించిన ఈ విజయం రాంనగర్ ప్రాంతానికి, మంచిర్యాల జిల్లాకు గర్వకారణమన్నారు. ఆమె సాధన యువతకు, ముఖ్యంగా విద్యార్థినులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం సుకన్యతో పాటు ఆమె తల్లిదండ్రులను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి మాజీ సర్పంచ్ జాడి శ్రీనివాస్, నాయకులు ఆసాల రాజన్న, ప్రభాకర్, కంది మహేందర్, పినుమల్ల శివప్రసాద్, మహిళా నాయకురాళ్లు మిట్టపల్లి మరియమ్మ, రాచర్ల రోజా, కలువల లక్ష్మీ, కలువల పద్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఎండాకాలం ముందే ఇంటింటికి వాటర్ సప్లై



**తాండూర్, ఏప్రిల్ 05(జనంసాక్షి):** బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాలతో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి పర్యవేక్షణలోతాండూరు మండల్ మాదారం గ్రామపంచాయతీ లోని పోచంపల్లి గ్రామంలో ప్రతి ఇంటికి నూతనంగా వాటర్ సప్లై పనులు వేగవంతం గా చేస్తున్నారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ పల్లి లక్ష్మణ్ ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి పోచంపల్లి వార్డు సభ్యులు గొర్లపల్లి బానేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# జగ్జీవన్ రామ్ చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలి

- మునిసిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి
- సమాజానికి మార్గదర్శకుడు : డీసీపీ రాజ మహేంద్ర నాయక్
- సమాజ మార్పుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్నాలోమ్



**జనగామ ప్రతినిధి, ఏప్రిల్ 5(జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయ ఆవరణలో భారత మాజీ ఉప ప్రధాని, దళిత వర్గాల ఆశాజ్యోతి, సమతావాది డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాల కారక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునిసిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, విశిష్ట అతిథులుగా డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్నాలోమ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన గావించి, కార్యక్రమాన్ని ఆరంభించారు. ఈ నేపథ్యంలో మునిసిపల్ ఛైర్పర్సన్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు డా. బాబు జగ్జీవన్ రామ్ అని పేర్కొన్నారు. చిన్న వయసులోనే సమాజంలో సమానత్వం పట్ల ఆసక్తి పెంచుకున్నారన్నారు. దళితుల హక్కు కోసం ఆయన చేసిన పోరాటం ఎనలేనిదన్నారు. భారత ప్రభుత్వంలో అనేక పదవుల్లో బాధ్యతలు చేపట్టి, దేశ అభివృద్ధిలో కీలక పాత్రను పోషించారన్నారు. ఈ క్రమంలో ఆయన చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలని తెలిపారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. డా. బాబు జగ్జీవన్ రామ్ సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆయన దేశానికి, ముఖ్యంగా అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. జగ్జీవన్ రామ్ ఆశయాలను భావి తరాలకు తీసుకెళ్లాలని సూచించారు. తదనంతరం లిఅదనపు కలెక్టర్ (రెవెన్యూ)లి మాట్లాడుతూ.. ఈరోజు ఒక గొప్ప రోజు అని, సమాజంలో మార్పు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడిని స్మరించుకుంటు న్నామని, ఆయన జీవితం అందరికీ ఒక మార్గదర్శకమని అన్నారు. అంతకుముందు తెలంగాణ సాంస్కృతిక కళాకారులచే డా. బాబు జగ్జీవన్ రామ్ అని జయంతి సందర్భంగా కళాజాత నిర్వహించి, పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు గద్దర కిషోర్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవి లత, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, షెడ్యూల్డ్ కులముల సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు డా. సుగుణాకర్ రాజు, డా. రాజమౌళి, గద్దల నరసింహారావు, మేడ శ్రీనివాస్, పరనాది వెంకటస్వామి, అడ్వకేట్ సాదిక్ అలీ, నీర్మల రాములు, మల్లిగారి రాజు, మల్లిగారి మధు, కన్నారపు ఉపేందర్, జెర్రిపోతుల కుమార్, రాగల్ల ఉపేందర్ , ఉడుగుల సాగర్, గిరిమల్లె రాజు, గువ్వల రవి, గజ్వేలి ప్రతాప్, తిప్పారపు విజయ్, నక్క సురేష్, సుద్దాల కుమారస్వామి, డా. బాలాజీ, డా. రంజిత్, మౌనిక, వార్డు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



## పి. వి. నరసింహారావు స్మారక మ్యూజియం సందర్శన

భీమదేవరపల్లి, ఏప్రిల్ 05(జనం సాక్షి) : మండలంలోని వంగర గ్రామంలో భారత రత్న మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు స్మారక మ్యూజియాన్ని ఆదివారం వరంగల్‌కు చెందిన స్మార్ట్ కిట్టి సభ్యులు కుటుంబాలతో కలిసి సందర్శించారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పి.వి. తనయుడు పి.వి. గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ పి.వి.ప్రభాకర్ రావు మ్యూజియం ప్రాముఖ్యతను వివరించారు. అలాగే పి.వి.కుటుంబ సభ్యుడు పి.వి.మదన్ మోహన్ పి.వి. రాజకీయ ప్రయాణం దేశానికి చేసిన సేవలను వివరించారు. ప్రముఖ న్యాయవాది వద్దిరాజు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పి.వి. ముఖ్యమంత్రిగా చేపట్టిన భూసంస్కరణలు ప్రధానిగా అమలు చేసిన ఆర్థిక సంస్కరణలు దేశ చరిత్రలో నిలిచిపోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు, ఉద్యోగులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం సభ్యులు కొత్తకొండ వీరభద్రస్వామి,వంగర కైలాస కళ్యాణి క్షేత్రాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

దస్తురాబాద్, ఏప్రిల్ 05 (జనంసాక్షి): మండల కేంద్రంలోని రేవోజీపేట గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామని అధ్యక్షుడు సుద్దాల గంగమల్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అప్పటి ఉప ప్రధాని చేసిన సేవలను కొనియాడారు. దేశ ఉప ప్రధానిగా ఆయన అందించిన సేవలు, విప్లవ కారుడిగా వేసిన అడుగులు నేటి తరానికి ఆదర్శమని ఆయన అన్నారు. నేటి యువత ఆయన నడిచిన బాటలో నడవాలని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ కోలా మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జనగామ పట్టణంలో అక్రమ సెల్లార్ నిర్మాణం

**కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి బొట్ల శ్రావణ్**



**జనగామ ప్రతినిధి, ఏప్రిల్ 5 (జనంసాక్షి):** జనగామ పట్టణంలోని హైదరాబాద్ రోడ్లో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో, బాలాజీనగర్ ప్రాంతంలో అనుమతి లేకుండా సెల్లార్ నిర్మాణం జరుపుతు న్నట్లు స్థానిక ప్రజలు మరియు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని జనగామ జిల్లా కలెక్టర్‌కు కేవీపీస్ పట్టణ కార్యదర్శి బొట్ల శ్రావణ్ కంప్లైంట్ ఇచ్చారు. అక్రమ నిర్మాణం కారణంగా భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, అలాగే పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలియజేశారు. మున్సిపాలిటీ నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత మున్సిపల్ కమిషనర్ మరియు అధికారులు స్పందించి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కేవీపీస్ పట్టణ కమిటీ తరఫున పలుమార్లు మున్సిపల్ కమిషనర్ కి ఫిర్యాదులు అందజేసినప్పటికీ ఎటువంటి చర్యలు లేకపోవడంతో, వెంటనే స్పందించి ఈ అక్రమ నిర్మాణాన్ని ఆపివేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జనగామ జిల్లా కలెక్టర్ కి కంప్లైంట్ ఇచ్చారు. అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి, ప్రజల భద్రత దృష్ట్యా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేవీపీస్ పట్టణ కార్యదర్శి బొట్ల శ్రావణ్ డిమాండ్ చేశారు.

# నేరెళ్ల వేణు మాధవ ఆడిటోరియంలో హ్యాపీ సండే కార్యక్రమం



**హనుమకొండ ప్రతినిధి 6 ఏప్రిల్ (జనం సాక్షి)** :ప్రజా పాలన పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్స్‌లోని నెరేళ్ల వేణుమాధవ ఆడిటోరియంలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ముఖ్య అతిథిగా హాజరై యోగా కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోజువారీ జీవితంలో యోగా సాధన ఎంతో ముఖ్యమని, ఇది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టి యోగా వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జీడబ్ల్యూఎంసీ సిహెచ్ఓ రాజిరెడ్డి, ఉప కమిషనర్ సమ్మయ్య, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ గోపాల్ రెడ్డి, కంది శ్రీనివాస రెడ్డి, యోగా గురూ హనుమంతు, వాకర్ల, సైకిల్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కెరమెరిలో ఉచిత మెగా వైద్య శిబిరం



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 5(జనంసాక్షి) :** కెరమెరి మండల పోలీసుల ఆధ్వర్యంలో, మెడిలైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, సన్ షైన్ హాస్పిటల్ మంచిర్యాల వారి సహకారంతో కెరమెరి పోలీస్ స్టేషన్ సమీపంలోని స్టార్ గార్డెన్స్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ హాజరై మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంపులో సుమారు 900 మంది ప్రజలు వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ,రేడియోలజీ, జనరల్ సర్జరీ, న్యూరో ఫిజిషియన్, డెంటల్, ఇ.ఎన్.టి వైద్యులు చికిత్సలు నిర్వహించారు. కంటి అద్దాలు అవసరమైన 50 మందికి అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, కెరమేరి సబ్ ఇన్స్పెక్టర్ మధుకర్, వాంకిడి సబ్ ఇన్స్పెక్టర్ మహేందర్, వైద్య బృందం, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మద్యం మత్తు.. యువత చిత్తు

భవిష్యత్తు కాపాడే విధానాలపై దృష్టి పెట్టాలా? ఈ చర్చకు సమాధానం ఇవ్వాల్సింది మాత్రం ప్రభుత్వాలే.

### దూరం చేయటానికి కఠిన చర్యలు చేపట్టాలి

ఈ విషయంలో పోలీసులతో పాటు సంబంధిత ఎక్సైజ్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. మద్యం మత్తులో యువత దారి తప్పుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు కేవలం ఆదాయం కోణంలో కాకుండా సామాజిక బాధ్యతతో ముందుకు రావాల్సిన అవసరం ఉంది. యువతను మద్యం నుంచి దూరం చేయడానికి కఠిన చర్యలు చేపట్టాలి. పాఠశాలలు, కాలేజీల సమీపంలో మద్యం దుకాణాలపై నిషేధం విధించాలి. అండర్ ఏజ్ కు మద్యం విక్రయించే వైన్ షాప్ నిర్వాహకులకు కఠిన శిక్షలు విధించాలి. రాత్రి వేళల్లో విక్రయాలపై పరిమితి విధించి, గస్తీలు పెంచి రాత్రివేళ అమ్మకాలకు అడ్డుకట్ట వేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వాహనదారులపై ఉదాసీనత ప్రదర్శించకుండా ఉక్కు పాదం మోపాలి. స్కూల్లు, కాలేజీల్లో దుష్ప్రభావాలపై ప్రత్యేక సెషన్లుగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. సోషల్ మీడియా, టీవీల ద్వారా అవగాహన ప్రచారాలు, మత్తు పదార్థాల వలన కుటుంబాలు పడుతున్న కష్టాలపై డాక్యుమెంటరీలు తీసి యువతను మరింత చైతన్యం చేయాలి.

# 9 అంతస్తుల రాజగోపురం... ఈశాన్యాన కోనేరు

భోజన శాలలు, ప్రసాద పంపిణీ కేంద్రం, ఈశాన్య దిక్కున కోనేరు,. తూర్పు దిక్కున ఆధ్యాత్మికత పరిఢవిల్లేలా అద్భుతమైన తోరణాలు, సమాచార కేంద్రం, దేవాలయానికి ఉత్తర, తూర్పు దిక్కుల్లో రోడ్ల అభివృద్ధి, దేవాలయం నుంచి ఆవతలి వైపు వెళ్లేందుకు అండర్ పాస్, ఆవతలి వైపున సోలార్ రూఫ్‌టాప్‌తో వాహనాల పార్కింగ్, దేవాలయ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన మొక్కలతో పుష్పవనం పనులు చేపట్టనున్నారు. ఆలయ ప్రాంగణం ఆవల హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. భవిష్యత్‌లో ఆలయం వెనుక భాగం భారీ వృక్షాలతో ఆలరారేలా మొక్కలు నాటనున్నారు.

**పుష్కరాలకు వచ్చే వారికి....**

గోదావరి నది పుష్కరాలు వచ్చే ఏడాది జూన్ లో ప్రారంభంకానున్నాయి. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలకు బాసర గోదావరి తీరానికి చేరకుంటారు. వారికి అవసరమైన అన్ని వసతులు ప్రస్తుత మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా చేపట్టనున్నారు. ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా అదే సమయంలో ఆలయ సంప్రదాయాలు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# చిరుతపల్లి -1 గిరిజన ఆశ్రమ పాఠశాలని గురుకులం చేయాలి...



**నూగుర్ వెంకటాపురం ఏప్రిల్ 5(జనం సాక్షి ):** వెంకటాపురం చిరుతపల్లి 1 గిరిజన ఆశ్రమ పాఠశాలను గురుకు లంగా చేయాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కొమరం భీమ్ కాలనిలో ఆదివాసులతో సమావేశమై ఈ సందర్భంగా పూనెం సాయి దొర మాట్లాడుతూ. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం కేంద్రంగా చిరుతపల్లి-1బాలికల ఆశ్రమ పాఠశాలను గురుకులం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఉన్నత చదువులు చదవలేక చాలామంది ఆదివాసి బిడ్డలు విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఎక్కువ ఆదివాసులు ఉంటారు కాబట్టి వారు పదవ తరగతికి పరిమితం అవుతున్నారని, ఇంటర్మీడియట్ గురుకులం చేస్తే ఆదివాసీ బిడ్డలకు ఉన్నత విద్యకు తోడ్పాటుగా ఉంటుందని అన్నారు. ఆదివాసి విద్యార్థుల భవిష్యత్తుని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని వెంకటాపురం చిరుతపల్లి- 1గిరిజన ఆశ్రమ పాఠశాలను తక్షణమే గురుకులంగా ప్రకటించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఆదివాసి విద్యార్థులు పై చేయిగా నిలవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తాటి లక్మయ్య.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.